చాటువుల్లో దాగిన హాస్యం, సమయస్ఫూర్తి

● డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు

వేళచ్చేరి, జూలై 28: 'చాటువుల్లో హాస్యం తొంగి చూస్తుంటుందని డా. నందనవనం శ్రీనివాస రావు అన్నారు. టి.నగర్ ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణా హాలులో వేద విజ్ఞాన వేదిక నిర్వహించిన 'తరత రాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో 151వ ప్రసంగానికి వక్తగా గుంటూరులోని హిందూ కళాశాల అధ్యాపకులు డా.నందనవనం శ్రీనివాసరావు హాజరయ్యారు. 'చాటు పద్యము-హాస్యము' అనే అంశంపై వక్త చేసిన ప్రసంగం సభికులనెంతో ఆహ్లాదపరిచింది. మొదటగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు సభకు స్వాగతం పలికి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. అనంతరం 'చిలుక రాధ' ప్రార్థనా గీతం ఆలపించగా, కందనూరు మధు వక్తను సభకు పరిచయం చేశారు. వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి మధు, డా. సీఎంకే రెడ్డి, పెరంబూర్ శర్మ వక్తను సత్కరించారు. వక్త చాటు పద్యాలలో హాస్యం తొంగి చూస్తుంటుందని చెబుతూ... "చాకివా నితోడ జగడాలు పడులేక, సిరిగలవాడు పట్టుచీర గట్టె శివుడు తోలుగప్పె, సీయని భైరవుండు చీర విసిరివేసె" అంటూ హాస్యాన్ని పండిస్తూ ఒక కవి చాటు పద్యంలో చెప్పారని తెలిపారు. తెనాలి రామలింగం వంటి కవులు పద్యాలలో హాస్యాన్ని వెలిబుచ్చుతూనే పాండిత్యానికి పెద్ద పీట వేశారని చెబుతూ వక్త కొన్ని పద్యాలను ఉదాహరించారు. చాటువులలో సమయస్ఫూర్తి ఉంటుందని చెబుతూ శ్రీనాథుని 'చాటు పద్యం' ఉదహరించారు. శ్లేషలో హాస్యముంటుందని, ఛలోక్తిలో హాస్యముంటుందని ధ్వనిలో హాస్యముంటుందంటూ ఎన్నో చాటువులను తెలిపిన వక్త సభికులను నవ్వించారు. అద్భుతమైన హాస్యం తొంగి చూసే చాటువులను ఎన్నిటినో ఉదాహరిస్తూ వక్త సభను రంజింపజేశారు. కందనూరు మధు వందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.



వక్త నందనవనం శ్రీనివాసరావును సత్కరిస్తున్న వేదవిజ్ఞానవేదిక కార్యదర్శి కందనూరు మధు, ఆచార్య సీఎంకే రెడ్డి

కంచి మేయర్‌కు పదవీగండం?

● నేడు అవిశ్వాస తీర్మానం



కాంచీపురం కార్పొరేషన్ భవనం (ఇన్‌సెట్‌లో) మేయర్ మహాలక్ష్మి

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం కార్పొరేషన్ మేయర్‌గా డీఎంకేకు చెందిన మహాలక్ష్మి వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్‌లో 51 మంది కార్పొరేటర్లుండగా, వారిలో 33 మంది డీఎంకే, అన్నాడీఎంకేకు 8 మంది, కాంగ్రెస్, పీఎంకే, టీఎంసీ, డీపీఐ. బీజేపీలలకు తలా ఒక కార్పొరేటర్ ఉన్నారు. వీరితోపాటు ఆరుగురు ఇండిపెండెంట్లున్నారు. మేయర్ మహాలక్ష్మికి వ్యతిరేకంగా డీఎంకే కార్పొరేటర్లు తిరుగుబాటు ప్రకటించారు. ఆ మేరకు 19 మంది కార్పొరేటర్లు డిప్యూటీమేయర్ కుమారగురు నాథన్ (కాంగ్రెస్) కూడా మేయర్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ సెంథిల్‌మురుగన్, జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసతీర్మానం ప్రతిపాదించే లేఖను అందజేశారు. ఆ మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు మేయర్‌పై అవిశ్వాసతీర్మానం ప్రతిపాదనపై చర్చలు జరుగుతాయని కమిషనర్ సెంథిల్ మురుగన్ ప్రకటించారు. మూడు వారాల క్రితం దీనికి సంబంధించి ప్రకటన విడుదలైంది. ఈ విషయమై కౌన్సిలర్లకు వర్తమానం కూడా పంపారు.



బస్సులో ఊటీకి బయలుదేరిన డీఎంకే కార్పొరేటర్లు

విశ్వాసతీర్మానం నెగ్గాలంటే...

మేయర్ మహాలక్ష్మిపై విశ్వాసతీర్మానం నెగ్గాలంటే కార్పొరేషన్ నియమనిబంధనల ప్రకారం ఐదింట నాలుగో వంతు కార్పొరేటర్లు సమావేశానికి హాజరై ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఆ మేరకు మొత్తం 51 మంది కార్పొరేటర్లలో 41 మంది సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. అదే సమయంలో విశ్వాసతీర్మానం వీగిపోవాలంటే ఐదింట ఒకవంతు కంటే ఎక్కువ మంది కార్పొరేటర్లు ఓటేయాల్సి ఉంటుంది. ఆ ప్రకారం 10 మందికిపైగా కార్పొరేటర్లు ఓటేస్తే మేయర్‌కు పదవీ గండం తప్పుతుంది. ప్రస్తుతం 13 మంది మేయర్‌కు మద్దతిస్తున్నారు. తక్కిన వారందరూ వ్యతిరేకిస్తూ ఆమెను మేయర్ పదవి నుండి దించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కార్పొరేషన్ సమావేశం జరుగుతుందా? మేయర్‌కు పదవీ గండం తప్పుతుందా అనే విషయాలపై సస్పెన్స్ కొనసాగుతోంది

ఊటీ టూర్‌లో ...

ఇదిలా ఉండగా సోమవారం అవిశ్వాస తీర్మానంపై చర్చలు జరుగనున్న నేపథ్యంలో డీఎంకేకు చెందిన 19 మంది కార్పొరేటర్లు శనివారం సాయంత్రం కాంచీపురం నుంచి ఊటీకి బస్సులో విహారయాత్రకు వెళ్ళారు. వారంతా సోమవారం జరిగే కార్పొరేషన్ సమావేశానికి గైర్హాజరవుతారని తెలుస్తోంది. అదే సమయంలో మేయర్ మహాలక్ష్మిపై ప్రతిపాదించిన అవిశ్వాసతీర్మానంపై సోమవారం ఓటింగ్ జరిగే అవకాశాలు లేవని చెబుతున్నారు. ఈ కార్పొరేషన్‌లో మొత్తం 33 మంది డీఎంకే కార్పొరేటర్లలో మేయర్‌ను మినహాయిస్తే 32 మందిలో 13 మంది ఇంకా మేయర్‌కే మద్దతునిస్తున్నారు. తక్కిన 19 మంది మేయర్‌ను వ్యతిరేకిస్తున్నారు. వీరందరూ కలిసి మేయర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసతీర్మానం ప్రతిపాదించి ప్రస్తుతం ఊటీకి వెళ్లటం చర్చనీయాంశంగాను మారింది. ఊటీకి విహారయాత్రగా వెళ్ళిన కార్పొరేటర్లలో కొంతమంది మాట్లాడుతూ సోమవారం జరిగే కార్పొరేషన్ సమావేశంలో పాల్గొనాలా? వద్దా? అనే విషయమై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. మరికొంతమంది తప్పకుండా కార్పొరేషన్ సమావేశంలో పాల్గొంటామని చెబుతున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న తిరుత్తణి ఆలయం

తిరుత్తణిలో నేడు ఆడికృత్తిక ఉత్సవాలు

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ ఆలయంలో ప్రతియేటా తమిళ మాసమైన ఆడి నెలలో వచ్చే కృత్తిక దినాన ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ మేరకు ఈ యేడాది ఆడికృత్తిక ఉత్సవాలు శనివారం ఆడి అశ్వినితో ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆడిమాస భరణి సందర్భంగా వేకువజామునే మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వేకువజామునే వేల సంఖ్యలో భక్తులు ఈ క్షేత్రానికి చేరుకున్నారు. క్యూలైన్లలో భక్తులంతా బారులు తీరారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు నెమలి కావళ్లు, పుష్పకావళ్లు, పన్నీరు కావళ్లు మోసుకుంటూ కొండమీది దేవుడికి సమర్పించేందుకు మెట్ల మార్గంలో ఆలయానికి చేరుకున్నారు.

అట్టహాసంగా ఆడి భరణి వేడుకలు

కొంతమంది భక్తులు వంటికి శూలాలు, బాణాలు గుచ్చుకుని ఊరేగింపుగా వెళ్ళి తమ మొక్కులను నెరవేర్చుకున్నారు. వేకువజాము నుండే పర్వతాలయం చుట్టూ వేల సంఖ్యలో భక్తులు గుమికూడారు. భక్తులు కావళ్లు సమర్పించేందుకు ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు ఈ యేడాది ఆడికృత్తిక వేడుకల్లో కావళ్లకు ఎలాంటి రుసుము వసూలు చేయకపోవడంతో భక్తులు స్వాగతించారు. ఆలయపరిసరాలన్నీ నిండిపోవడంతో కొండ మీదికి పోలీసులు వాహనాలను అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు. భక్తుల కోసం దేవస్థానం నడుపుతున్న బస్సు మాత్రమే కొండమీదికి వెళ్లేందుకు అనుమతించారు. భక్తులంతా కొండదిగువనున్న శరవణతీర్థంలో స్నానమాచరించి మెట్లమీదుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. వాహనాల రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు పోలీసులు తిరుత్తణి నలువైపులా వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఆడికృత్తిక ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు, పోలీసులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పర్వతాలయం, ఆలయకోనేటి ప్రాంతం, ఘాట్‌రోడ్డు, గోపురం సహా అన్ని ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దర్శనం జరిగేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రసాదం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కూడా కల్పించారు. కావళ్లు తీసుకువచ్చే భక్తులు తీర్థకొలనులో పారవేసే పూలమాలలను తొలగించేందుకు, పర్వతాలయం చుట్టూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనుల్లో పారిశుద్ధ్య కార్మికులు నిమగ్నమయ్యారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ అరుణాచలం, ట్రస్టుబోర్డు ఛైర్మన్ శ్రీధరన్, సభ్యులు ఉషారవి, మోహనన్, సురేష్‌బాబు, నాగన్ ఇతర అధికారులు కలిసి భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. జిల్లా ఎస్పీ శీనివాస పెరుమాళల్ ఆదేశాలతో తిరుత్తణి డీఎస్పీ విగ్నేష్ తమిళ్ మారన్ పర్యవేక్షణలో సుమారు వెయ్యిమందికి పైగా పోలీసులతో భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కీలకమైన ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రౌడీషీటర్లు, జేబుదొంగల కదలికలపై నిఘా వేశారు. అక్కడ ఫైరింజన్లు, ప్రత్యేక వైద్యశిబిరాలను కూడా ఏర్పాటు చేశారు.



కావళ్లు మోసుకొస్తున్న భక్తులు

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

ఐఎండీ హెచ్చరిక

ప్యారీస్, జూలై 28 : రాష్ట్రంలో సోమవారం నుండి ఆగస్టు రెండు వరకు భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరికను జారీ చేసింది. బంగాళాఖాతంలో పడమటి దిశ గాలులు గంటకు 45 నుండి 55 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని, అదే విధంగా సోమవారం నుండి వారం రోజులపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో ఆదివారం పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు 7 నుంచి 11 సెం.మీల దాకా నమోదు కావటంతో ఎల్లో అలెర్ట్ కూడా జారీ అయ్యింది. కొండలు అధికంగా ఉన్న నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో కురిసే భారీ వర్షాల వల్ల ముంపు ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వాతావరణ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కాగా బంగాళాఖాతంలో గాలులు వేగం గంట గంటకు పెరిగే అవకాశాల ఉండటంతో కోస్తా జిల్లాలకు చెందిన మత్స్యకారులు చేపలవేట మానుకోవాలని హెచ్చరించింది.

నాయకులకు, మహిళలకు భద్రత లేదు

● తూత్తుకుడిలో మాజీ సీఎం ఈపీఎస్



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూలై 28: రాజకీయ నాయకులకు, మహిళలకు డీఎంకే పాలనలో భద్రత లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. తూత్తుకుడిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో హత్య జరగని రోజంటూ లేదని, పోలీసులకు అధికారం లేనందు వల్ల హత్యల రాష్ట్రంగా మారడం విచారకరమన్నారు. జనవరి ఒకటి నుంచి రెండు వందల రోజుల్లో 595 హత్యలు జరిగాయని, అయినా డీఎంకే ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తోందని విమర్శించారు. మూడేళ్లలో శాంతి భద్రతలు దారుణంగా క్షీణించాయని, మరోవైపు మాదకద్రవ్యాల వినియోగం బాగా పెరిగిందన్నారు. డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్న విపక్షాలకు ప్రజల మద్దతు బాగా పెరిగిందని, అందువల్ల ప్రజలను తప్పు దారి మళ్లించేలా డీఎంకే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టిందని వ్యాఖ్యానించారు. తిరునల్వేలి జిల్లా అధ్యక్షుడు జయకుమార్ హత్యకేసులో ఇప్పటివరకు నిందితులు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, రాష్ట్రంలో పోలీసు శాఖ ప్రజలకు రక్షణ కల్పించటానికి బదులుగా అధికార పార్టీకి తొత్తుగా పనిచేస్తుందని ఈపీఎస్ మండిపడ్డారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో సేలం జిల్లా తలైవాసల్ రూ.1000 కోట్లతో అతి పెద్ద వెటర్నరీ పార్కు నిర్మించామని ఈ భవనాన్ని ఇప్పటివరకూ ప్రారంభించకపోడం దురదృష్టకరమన్నారు. శివగంగ పంచాయతీలో ఓ మహిళ అధికారిని డీఎంకే కార్మిక సంఘం నేత దారుణంగా దాడి చేసే వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యిందని, దీనిని బట్టి ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రక్షణ కరువైందని రుజువవుతోందని ఈపీఎస్ ఆందోళన వ్యక్తం చేశారు.

పుదుచ్చేరి గవర్నర్‌గా

కైలాసనాథన్

ప్యారీస్, జూలై 28: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి నూతన గవర్నర్ కె. కైలాసనాథన్‌ను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. గుజరాత్ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన కైలాసనాథన్ పుదుచ్చేరి గవర్నర్‌గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే, జార్ఖండ్ గవర్నర్ తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరించిన తమిళనాడు బీజేపీ సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కొత్త గవర్నర్ల నియామకంపై జారీచేసిన జాబితాలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రస్తావన లేకపోవడంతో ఈ నెల 31న పదవీవిరమణ చేయాల్సిన ఆయన మరికొన్ని రోజులు గవర్నర్ పదవిలో కొనసాగే అవకాశముందని తెలుస్తోంది.



గవర్నర్ కైలాసనాథన్



మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

9 జిల్లాలకు వరద ముప్పు

కావేరి డెల్టాకు మేట్టూరు జలాల విడుదల



మేట్టూరు డ్యామ్ జలాల విడుదల నేపథ్యంలో డెల్టా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎం స్టాలిన్



మేట్టూరు డ్యామ్ నుండి జలాలను విడుదల చేసి పూలు చల్లుతున్న నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, జూలై 28: కావేరి డెల్టా జిల్లాల్లో అవసరమైన సాగు నీటిని రాష్ట్ర నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదివారం సేలం జిల్లా మేట్టూరు డ్యాం గేట్లు తెరచి విడుదల చేశారు. నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో, కర్ణాటక, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కర్ణాటకలో భారీవర్షాల కారణంగా అక్కడున్న కృష్ణ రాజసాగర్, కబిని డ్యాంలు పూర్తిగా నిండాయి. ఆ డ్యాంల భద్రత దృష్ట్యా రాష్ట్రానికి 1.66 లక్షల ఘనపుటడుగుల నీటిని కావేరి నదిలోకి కర్ణాటక ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు మేట్టూరు డ్యాంలో సెకనుకు 1.47 లక్షల ఘనపుటడుగుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 109.20 అడుగులకు పెరిగిన నేపథ్యంలో, 77.27 టీఎంసీల నీరుంది. మరోవైపు కావేరి జలాలు అధిక స్థాయిలో డ్యాంలో చేరుతున్నందు వల్ల ఒకటి, రెండు రోజుల్లో మేట్టూరు డ్యాం తన పూర్తి సామర్థ్యంతో నిండుతుంది. ఇదిలా ఉండగా, మేట్టూరు డ్యాంలో నీరు పెరగడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఇందులో జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా, డెల్టా జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర నగరాభివృద్ధి శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ మేట్టూరు డ్యాం జలాలను విడుదల చేశారు. కావేరి తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజాపనుల శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. కావేరిలో వరద ప్రవాహం ఉధృతి కావడంతో కావేరి డెల్టా జిల్లాల్లో అత్యవసర కంట్రోల్ రూంలు 24 గంటలు పనిచేస్తాయని జిల్లా కలెక్టర్లు ప్రకటించారు. కావేరి నదిలో వరద ప్రవాహం ఉధృత రూపం దాల్చినందున కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్ ఈరోడ్, కరూరు, తిరుచ్చి, తంజావూరు, నాగపట్టినం జిల్లాలకు అధికారులు వరద హెచ్చరిక జారీ చేశారు. ఈ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వరద బాధిత ప్రాంతాల ప్రజలు 1070, 1077, 9445869848 అనే నెంబర్లు కలిగిన వాట్సాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది.

సమాచార దర్శిని

నేడు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

ఐసిఎఫ్, జూలై 28: ఇంజనీరింగ్ కోర్సుల జనరల్ విభాగం కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్లలో మాజీ సైనికుల పిల్లలు, క్రీడాకారులు, దివ్యాంగులు అనే ప్రత్యేక విభాగాల కౌన్సెలింగ్ ఈనెల 22 నుంచి 27వ తేది వరకు, 22,23 తేదీల్లో ప్రత్యేక విభాగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ విభాగాలకు మొత్తం 710 సీట్లు కేటాయించగా, కౌన్సెలింగ్ ద్వారా 92 సీట్లు భర్తీ అయ్యాయి. కళాశాలలు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు 23వ తేది ఆన్‌లైన్‌లో కళాశాలలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ప్రత్యేక విభాగాలకు జనరల్ కౌన్సెలింగ్ 25వ తేది ప్రారంభమై శనివారం ముగిసింది. ఈ నేపథ్యంలో, ఇదివరకే ప్రకటించిన విధంగా జనరల్ విద్యార్థులకు సోమవారం ప్రారంభమయ్యే కౌన్సెలింగ్ సెప్టెంబరు 3 వరకు మూడువిడతలుగా జరుగనుంది. అలాగే, వృత్తి విద్య విభాగం కౌన్సెలింగ్ సోమవారం నుంచి ఆగస్టు 10వ తేది వరకు ఒకే విడతగా నిర్వహించనున్నారు.

రేపు వ్యవసాయ కోర్సుల కౌన్సెలింగ్

పెరంబూర్, జూలై 28: తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 30వ తేది జరుగనుంది. ఈ వర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థులు అడ్మిషన్ కౌన్సెలింగ్ జరుగుతోంది. జనరల్ విభాగంలో 7.5 శాతం సీట్లకు మంళవారం జరుగనుంది. మొత్తం 171 సీట్ల భర్తీకి ఎంపిక చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపినట్లు, వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఉన్న ఖాళీ సీట్ల వివరాలను విద్యార్థులకు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులకు మరో అవకాశం కల్పించబోమని వర్సిటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

1,355 ఆలయాలకు కుంభాభిషేకం

పెరంబూర్, జూలై 28: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం 1,355 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించినట్లు రాష్ట్రప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, రూ.3,776 కోట్లతో 8,436 ఆలయాల జీర్ణోద్ధపనులకు అనుమతులివ్వగా, 5,776 ఆలయాల్లో పనులు ముగిశాయని తెలిపింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1,250 ఆలయాల పునరుద్ధరణ పనులకు తలా రూ.2 లక్షలకు పెంచి రూ.25 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలియజేసింది.

నేడు తిరువళ్లూరు జిల్లాకు సెలవు

పెరంబూర్, జూలై 28: తిరువళ్లూర్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం సోమవారం జరుగనుంది. ఈ ఉత్సవాలకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు రానున్నారు. ఆడికృత్తిక సందర్భంగా సోమవారం జిల్లాకు సెలవు ప్రకటిస్తున్నట్లు, అందుకు బదులుగా ఆగస్టు 10న పనిదినంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

31తో ముగియనున్న ఐటీఐ అడ్మిషన్లు

ఐసిఎఫ్, జూలై 28: స్థానిక ఆర్కే నగర్ ఐటీఐ అడ్మిషన్లు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నాయి. శిక్షణలో చేరే విద్యార్థులకు ప్రతినెలా రూ.770 ఉపకారవేతనంతో పాటు సైకిల్, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ఉపకరణాలు అందజేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అదనంగా నెలకు రూ.1,000 అందజేస్తారు. శిక్షణ పూర్తికాగానే ఉద్యోగాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు 044-25911187, 9962452989 నెంబర్లు సంప్రదించవచ్చు.

37 జిల్లాల్లో పంట కల్లాలు

ఐసిఎఫ్, జూలై 28: రైతులు వినియోగించేందుకు 37 జిల్లాల్లో 100 పొడి కల్లాలు ఏర్పాటుచేస్తున్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు పలు జిల్లాల్లో స్థల సౌకర్యం లేదు. రహదారులు, ప్రజలు, జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఆరబెట్టడంతో నష్టం జరుగుతోంది. ఈ నష్టాలు అడ్డుకొనేలా వ్యవసాయం, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో 2021 నుంచి పొడి కల్లాలు ఏర్పాటుచేస్తున్నారు. ఆ ప్రకారం, రెండేళ్లలో రూ.20 కోట్ల వ్యయంతో 185 పొడి కల్లాలు ఏర్పాటుచేయగా, ప్రస్తుతం మరో 100 క్షేత్రాలు రూ.34 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేయనున్నారు.

2న పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశాలు

పెరంబూర్, జూలై 28: నగరంలోని ప్రభుత్వ, కార్పొరేషన్ పాఠశాలల నిర్వహణ కమిటీ సమావేశం ఆగస్టు 2వ తేది జరుగనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, బోధన విధానాలు, పాఠశాలల అభివృద్ధిపై చర్చించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహణ కమిటీలు ఏర్పాటయ్యాయి. పాఠశాల నిర్వహణ కమిటీల సమావేశం వచ్చే శుక్రవారం జరుగుతుందని, ఈ సమావేశంలో తల్లిదండ్రులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని అధికారులు తెలిపారు.

కొరత లేకుండా ఆవిన్ పాల సరఫరా

పెరంబూర్, జూలై 28: నగరంలోని వినియోగదారులకు కొరత లేకుండా పాలు సరఫరా చేసేలా చర్యలు చేపట్టినట్లు ఆవిన్ సంస్థ తెలియజేసింది. ఈ మేరకు ఆ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో, అంబత్తూర్‌లో ఉన్న పాల కేంద్రంలో వచ్చే నెల 16వ తేది వరకు మరమ్మతుల కారణంగా పాల సరఫరా తగ్గనుందని తెలిపింది. ఈ లోటును భర్తీచేసేలా నగరంలోని ఇతర పాల కేంద్రాలు, పెరంబలూరు జిల్లా పాడలూరు పాల కేంద్రం నుంచి 1.50 లక్షల లీటర్ల పాలు నగరానికి తీసుకొచ్చి విక్రయించనున్నామని ఆవిన్ తెలియజేసింది.

ఆదాయ పరిమితి పెంపు

ఐసిఎఫ్, జూలై 28: నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించే పథకం కింద కుటుంబ వార్షిక ఆదాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. చదువుకొని ఉద్యోగాలు లేకుండా ఉన్న యువకులు స్వీయవృత్తులు ప్రారంభించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారేందుకు ప్రభుత్వం పథకాలు రూపొందిస్తోంది. వృత్తులు ప్రారంభించేందుకు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు రుణాలు అందజేస్తోంది. ఆ రుణానికి సబ్సిడీకి 25 శాతం అందజేస్తోంది. కనిష్ఠ విద్యార్హత 8వ తరగతి కలిగి ఉన్న లబ్ధిదారుల కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలన్న నిబంధనను సవరిస్తూ ఈ పరిమితి రూ.8 లక్షలకు ప్రభుత్వం పెంచింది.

మల్లిగై మలైలో కార్చిచ్చు

ఐసిఎఫ్, జూలై 28: తిరుచ్చి జిల్లా మనప్పారై కల్లుపట్టి మల్లిగై మలైలో శుక్రవారం రాత్రి కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. గాలి వేగంగా వీచడంతో మంటలు సులభంగా అంటుకొని చెట్లు దగ్ధమయ్యాయని తెలిపారు. తురంకుర్చి అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను దాచేందుకే...

కేంద్రంపై స్టాలిన్ ఆరోపణలు

● పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శ


మదురైలో మీడియాతో మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్ రెడ్డి

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలు జనానికి తెలియకుండా వారి దృష్టిని మరల్చేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్రంపై, కేంద్ర బడ్జెట్‌పై పసలేని విమర్శలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మదురై విమానాశ్రయం వద్ద ఆదివారం మీడియాతో మాట్లాడుతూ స్టాలిన్ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం గర్హనీయమన్నారు. ఆ సమావేశంలో పాల్గొనకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలకే తీరని నష్టం కలుగుతుందన్నారు. రాజకీయ కారణాల కోసం నీతిఆయోగ్ సమావేశాన్ని స్టాలిన్ బహిష్కరించడం తగదన్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకుల ప్రాణాలకు భద్రతలేదని, ఇటీవలి కాలంలో రాజకీయ నేతల హత్యలు అధికమయ్యాయని తెలిపారు. నీట్‌ను ఇండియా కూటమి వ్యతిరేకిస్తున్నదని, నీట్ పేపర్ల లీక్‌పై లేనిపోని రభస చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడం ఆనవాయితీగా మారిందన్నారు. కళ్లకుర్చిలో కల్తీసారా తాగి 70 మందికిపైగా మృతి చెందారని, ఆ సంఘటనపై రాష్ట్ర ప్రజలంతా స్పందించి డీఎంకేకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

తంజావూరు జోన్‌లో గ్రీవెన్స్‌డేకు అపూర్వ స్పందన

● డీజీపీ శంకర్‌జివాల్

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జోన్‌లో పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు స్పందన వచ్చిందని డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం తంజావూరు వెళ్లిన ఆయన ఆ జోన్ పరిధిలోని వివిధ జిల్లాల ఎస్పీలతో భేటీ అయి, శాంతిభద్రతలపై సమీక్షించారు. ఆ తర్వాత జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా 482 మంది పోలీసులు వివిధ సమస్యలపై సమర్పించిన వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారానికి తగిన ఆదేశాలిచ్చారు. అనంతరం తంజావూరులో నిర్మిస్తున్న పోలీసు క్వార్టర్స్ కొత్త పోలీసుస్టేషన్ భవనాల నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు.


గ్రీవెన్స్ లో పోలీసుల సమస్యలను తెలుసుకుంటున్న డీజీపీ శంకర్‌జివాల్

కీళడిలో మట్టి ఆభరణాలు లభ్యం



ఐసిఎఫ్, జూలై 28: శివగంగ జిల్లా కీళడిలో పూర్వీకులు వినియోగించే బంకమట్టి ఆభరణాలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతంలో 10వ విడత తవ్వకాలు నెలరోజులకు పైగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన తవ్వకాల్లో తమిళ లిపి, చేప ఆకారం కలిగిన కుండ పెంకులు, గాజు పూసల దండలు, ఇతర పనిముట్లు వంటివి లభించాయి. ఈ నేపథ్యంలో, శనివారం బంకమట్టితో తయారుచేసిన ఆభరణాలు లభించాయి. 2.5, 1.5 సెం.మీ వ్యాసం కలిగిన వృత్తాకార ఆభరణాలు లభించాయి. ఈ తవ్వకాలు సెప్టెంబరులో ముగించనున్నట్లు పురావస్తు పరిశోధకులు తెలిపారు.

తమిళ బడ్జెట్‌లో 27 జిల్లాల పేర్లు లేవు...!

● బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజా

పెరంబూర్, జూలై 28: రాష్ట్ర బడ్జెట్‌లో 27 జిల్లాల పేర్లు లేవని బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజా తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడు పేరు కానీ, రాష్ట్రానికి కొత్త పథకాలు, నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ అధికార డీఎంకే రాష్ట్రవ్యాప్త ధర్నాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కేంద్ర బడ్జెట్‌లోని అంశాలు ప్రజలకు తెలియజేసేలా సెంజిలో శనివారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభలో హెచ్.రాజా మాట్లాడుతూ... బడ్జెట్‌లో రాష్ట్రం పేరు లేనంత మాత్రాన ఆ రాష్ట్రాన్ని విస్మరించినట్లు కాదని, కేంద్ర పథకాల అమలుకు సంబంధించి అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు అందజేస్తుందని రాజా తెలిపారు.

ఎద్దు పొడిచి యువకుడి మృతి

పెరంబూర్, జూలై 28: జల్లికట్టు పోటీల్లో ఎద్దు పొడిచి యువకుడు మృతిచెందిన ఘటన శివగంగ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. సూరకుడిలో ఆడి మాసం సందర్భంగా ఆదివారం ఎద్దులు వదిలే పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో వనంగంపాడికి చెందిన కార్తీక్ పాల్గొని, ఎద్దును అదుపుచేసే సమయంలో అది అతడిపై దాడిచేయడంతో తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటన అనంతరం పోటీలు నిలిపివేయగా, కుండ్రకుడి పోలీసులు విచారణ చేపట్టారు.

పాము, కుక్క కాటుకు 24 గంటలు చికిత్స

ఐసిఎఫ్, జూలై 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విష విరుగుడు మందులను ఖరారు చేయడంతో పాటు 24 గంటలు చికిత్స అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు కుక్క కాటుకు 2.43 లక్షల మంది గురికాగా, 22 మంది మృతిచెందారు. పాము కాటుకు 7,310 మంది గురికాగా, 40 శాతం మందికి పైగా మరణించి ఉంటారని ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు అన్ని జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం పంపిన ఉత్తర్వుల్లో... అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పాము, కుక్క కాటు మందులు 25 డోసులు తప్పనిసరిగా నిల్వ ఉంచాలని, 108 అత్యవసర అంబులెన్స్ సేవలతో పాటు 24 గంటలు చికిత్సలందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తి

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తమిళనాడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ కృష్ణకుమార్

కొల్లిడం వాగు పరిశీలన

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని జలశయాల నుండి అత్యధిక పరిమాణంలో అదనపు జలాలు విడుదలవుతుండటంతో తొమ్మిది జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొల్లిడం వాగు ప్రాంతాన్ని కడలూరు జిల్లా కలెక్టర్ సిబీ ఆదిత్యా అధికారులతో కలిసి పరిశీలించారు. కావేరి వాగులో నీటి ఉధ్రుతి అధికంగా ఉండడంతో మేట్టూరు డ్యామ్ నీటి మట్టం కూడా 109 అడుగులు దాటింది. ఈ పరిస్థితుల్లో కొల్లిడం వాగును కలెక్టర్ పరిశీలించి వరద ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంపై అధికారులతో సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు.


అధికారులతో కలిసి వాగును పరిశీలిస్తున్న కడలూరు కలెక్టర్ ఆదిత్య

పూంమల్లి రహదారిలో లారీల దగ్ధం


దగ్ధమవుతున్న లారీలు

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పూందమల్లి సమీపం నజరత్‌పేట వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు లారీలు దగ్ధమయ్యాయి. నజరత్‌పేట ప్రాంతంలో ఉన్న ప్రైవేటు కర్మాగారాలకు ఉత్తరాది రాష్ట్రాల నుంచి ముడి పదార్థాలను లారీల్లో తీసుకువస్తుంటారు. ఆ రీతిలోనే శనివారం అర్ధరాత్రి ఓ కంటైనర్ లారీలో థిన్నర్ రసాయనాలున్న క్యాన్ల లోడుతో ఆ ప్రాంతానికి వచ్చింది. ఆ కంటైనర్‌ను రోడ్డు పక్కగా నిలిపి, మరొక లారీలో థిన్నర్ క్యాన్లను కార్మికులు లోడింగ్ చేస్తుండగా, ఓ క్యాన్ రోడ్డుపై పడి పగిలి అందులోనే రసాయనాలు కంటైనర్ లారీపై పడి మంటలు చెలరేగాయి. వెంటనే ఆ లారీ చుట్టూ మంటలు వ్యాపించాయి. దీంతో కార్మికులు పరుగెత్తారు. అదే సమయంలో ఆ కంటైనర్ తోపాటు, క్యాన్లను లోడ్ చేస్తున్న లారీకి కూడా మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో రెండు లారీలు మంటలలో దగ్ధమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పూందమల్లి, అంబత్తూరు, మదురవాయల్, జేజే నగర్, ఆవడి, కోయంబేడు, ఇరుంగాట్టుకోట నుంచి ఏడు ఫైరింజన్లతో హుటాహుటిన అక్కడికి చేరుకుని గంటల తరబడి పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. నజరత్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

నగల కోసం వృద్ధురాలి హత్య

● శవాన్ని వాగులో విసిరేసిన దంపతుల అరెస్టు


నిందితులు పార్తీబన్, సంగీత

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో నగలు నగదు కోసం వృద్ధురాలిని హతమార్చి శవాన్ని గోనెసంచిలో కట్టి అడయార్ వాగులో విసిరేసిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వారం రోజుల తర్వాత ఆ వృద్ధురాలి మృతదేహాన్ని ఆదివారం ఉదయం పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు. ఎంజీఆర్‌నగర్ మయిలైసామి ముత్తునగర్‌లో విజయ (77) అనే వృద్ధురాలు భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ ఓ ఇంటిలో ఒంటరిగా ఉండేది. వారం రోజుల క్రితం ఆమె హఠాత్తుగా అదృశ్యమైంది. దీంతో ఆమె కుమార్తె లోకనాయకి ఎంజీఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా ఆ వృద్ధురాలి ఇంటి పక్కనే నివసించే పార్తీబన్, సంగీత అనే దంపతులు మాయమైనట్లు కనుగొన్నారు. వారి ఆచూకీ కోసం గాలించిన మీదట విరుదునగర్‌లో శనివారం సాయంత్రం ఇరువురిని అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు. ఆ దంపతులను విచారించగా వృద్ధురాలి వద్దనున్న నగలు, నగదు కోసం హతమార్చినట్లు వెల్లడైంది. ఆ వృద్ధురాలి వద్దనున్న రెండు సవర్ల నగలు, రూ.50వేలు దోచుకున్న దంపతులు వృద్ధురాలిని హతమార్చారు. ఆ మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి బైకులో తీసుకెళ్ళి అడయార్ వాగులో విసిరేసి ఏమీ తెలియనట్లు ఇంటికి చేరుకున్నారు. ఈ మేరకు ఆ దంపతులు వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తగ్గిన టమోటా ధరలు

పెరంబూర్, జూలై 28: స్థానిక కోయంబేడు మార్కెట్లో దిగుమతులు పెరగడంతో టమోటా ధరలు తగ్గాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా మార్కెట్‌కు టమోటా దిగుమతులు తగ్గడంతో వాటి ధరలు పెరిగాయి. మార్కెట్లో కిలో రూ.70కి విక్రయం కాగా, చిల్లర మార్కెట్లో రూ.100 వరకు పలికింది. ఈ క్రమంలో, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో టమోటా దిగుమతులు పెరిగి కిలో రూ.34కు విక్రయవుతుండగా, చిల్లర మార్కెట్లో రూ.50గా ఉంది. అలాగే, క్యారట్ రూ.80, బీన్స్ రూ.40, సాంబారు ఉల్లి రూ.35, బంగాళాదుంపలు, మునక్కాయలు రూ.30, క్యాబేజీ, ముల్లంగి తలా రూ.20, ఉల్లి రూ.10కి విక్రయమయ్యాయి.


నామక్కల్ జిల్లా పళ్ళిపాళయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కావేరి వాగు జలాలు

డిప్యూటీ జైలర్లుగా 11 మందికి పదోన్నతి

ఐసిఎఫ్, జూలై 28: రాష్ట్రంలో సబ్ జైళ్లలో సహాయ జైలర్లుగా ఉన్న 11 మందికి డిప్యూటీ జైలర్లుగా పదోన్నతి కల్పిస్తూ జైళ్ల శాఖ డీజీపీ మహేశ్వర్‌దయాళ్ ఉత్తర్వులు జారీచేశారు. నాగపట్టణం జిల్లా జైలులో పనిచేస్తున్న అరుణ్‌రాజ్ శివగంగ జిల్లా పురసడై జైలుకు బదిలీ అయ్యారు. మనోరంజితం కోయంబత్తూర్ సెంట్రల్ జైలులో పదోన్నతి పొందారు. చెన్నై పుళల్ సెంట్రల్ జైలులో పనిచేసిన ముత్తు తిరునల్వేలి సెంట్రల్ జైలుకు, పుగళరని పుళల్ సెంట్రల్ జైలుకు బదిలీ అయ్యారు. కోయంబత్తూర్ సెంట్రల్ జైలులో పనిచేసే నాగేశ్వరన్ తేని జిల్లా జైలుకు, అరూర్ సబ్ జైలులో పనిచేసే శివపెరుమాళ్ వేలూరు సెంట్రల్ జైలుకు, మదురై సెంట్రల్ జైలులో పనిచేసే అబ్దుల్ రహీమ్ పేరూరణి జైలుకు, పళని సబ్ జైలులో పనిచేసే కుమార్ సేలం సెంట్రల్ జైలుకు, శంకరన్‌కోయిల్ సబ్ జైలులో పనిచేసే శంకర్ నాంగునేరి సబ్ జైలుకు బదిలీ అయ్యారు. దురైయూర్ సబ్ జైలులో పనిచేసే షర్మిల తిరుచ్చికి, కడలూరులో సుందరపాండ్యన్ ధర్మపురి జైలుకు బదిలీ అయ్యారు.

సేలం మీదుగా ఎర్నాకుళం-బెంగళూరు మధ్య వందే భారత్ రైలు

పెరంబూర్, జూలై 28: సేలం మీదుగా ఎర్నాకుళం-బెంగళూరు మధ్య వందే భారత్ రైలు నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.06001 ఎర్నాకుళం-బెంగళూరు కంటోన్మెంట్ వందే భారత్ ప్రత్యేక రైలు ఈ నెల 31 నుంచి ఆగస్టు 25వ తేది వరకు బుధ, శుక్ర, ఆదివారాల్లో ఎర్నాకుళం నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరి త్రిశూర్, పాలక్కాడు, పోతనూరు, తిరుప్పూర్, ఈరోడ్ మీదుగా సాయంత్రం 6.33 గంటలకు సేలం చేరుకుంటుంది. అక్కడి నుండి 6.35 గంటలకు బయల్దేరి రాత్రి 10 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06002 బెంగళూరు కంటోన్మెంట్-ఎర్నాకుళం ప్రత్యేక వందే భారత్ రైలు ఆగస్టు 1నుంచి 26 వరకు గురు, శని, సోమవారాల్లో బెంగళూరు కంటోన్మెంట్ నుంచి తెల్లవారుజామున 5.30 గంటలకు బయల్దేరి ఉదయం 8.58 గంటలకు సేలం చేరుకుంటుంది. అక్కడి నుండి 9 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.20 గంటలకు ఎర్నాటకుళం చేరుకుంటుంది.

కార్పొరేషన్ పార్కుల్లో గ్రంథాలయాలు

ఐసిఎఫ్, జూలై 28: ప్రజల మధ్య పఠనాశక్తి పెంచేలా కార్పొరేషన్ పార్కుల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. సాంకేతికాభివృద్ధితో గ్రంథాలయాలకు వెళ్లి చదివేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలో, ప్రజలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. తొలివిడతగా రాయపురం మండల పరిధిలోని చూలై ఏపీ రోడ్డులో ఉన్న రాఘవేంద్ర పార్క్, చింతాద్రిపేటలో ఉన్న మేడే పార్కుల్లో మినీ లైబ్రరీలు ఏర్పాటుచేసి, ఒక్కో లైబ్రరీకి 300లకు పైగా పుస్తకాలు కేటాయించారు. త్వరలో తిరువొత్తియూర్ మండలంలో ఎంఆర్‌ఎఫ్ గార్డన్, పూందోట్టం పార్క్, మనలి మండలంలో 2వ ప్రధాన రహదారిలో ఉన్న పార్క్, ఎంఎండీఏ పార్క్, మాధవరం మండలంలో పద్మగిరి పార్క్, కేకే ఆర్ గార్డన్, తండయార్‌పేట మండలంలో జీఎన్‌టీ రోడ్డులో ఉన్న హంసా గార్డన్, జీవా పార్కుల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయనున్నారు.

బీసెంట్ నగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

ఐసిఎఫ్, జూలై 28: ఆక్రమణలు అరికట్టేలా బీసెంట్ నగర్‌లో సీసీ కెమెరాలను కార్పొరేషన్ ఏర్పాటుచేస్తోంది. అడయార్ మండలం 179 వార్డు బీసెంట్ నగర్ మురుగన్ ఆలయ సమీపంలో ఉన్న సముద్రతీరాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడంతో పాటు ప్లాట్లు వేసి విక్రయిస్తున్నా రు. గత వారం కార్పొరేషన్ అధికారులు ఆక్రమణలు తొలగించి, అది ప్రభుత్వ స్థలమన్న బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, 1.5 కి.మీ దూరం వరకు 12 కెమెరాలను ఏర్పాటుచేశారు. మిగిలిన చోట్ల కూడా కెమెరాలు ఏర్పాటుచేస్తున్నామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

మూడు రకాల మద్యం విక్రయాలపై నిషేధం

ఐసిఎఫ్, జూలై 28: నిషా తక్కువగా ఉన్న మూడు రకాల మద్యం విక్రయాలపై టాస్మాక్ సంస్థ నిషేధం విధించింది. ట్రోఫికానా వీఎస్ ఓపీ బ్రాంది, ఓల్డ్ సీక్రెట్ బ్రాండ్, వీరన్ స్పెషల్ బ్రాంది తాగితే మత్తు త్వరగా ఎక్కడం లేదని, ఎంత తాగినా నిషా ఉండడం లేదని మందుబాబులు ఆరోపిస్తున్నారు. మరికొందరు నకిలీ సరుకని చెప్పడంతో ఆ మూడు రకాల నాణ్యతను ప్రయోగశాలలో పరీక్షించారు. వాటిలో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉందని గుర్తించారు. దీంతో ఆ మూడు మద్యం రకాల విక్రయాలపై నిషేధం విధించిన టాస్మాక్ సంస్థ, ఆ మద్యం సీసాలు వెనక్కి తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో మరో ముగ్గురి అరెస్ట్

ఐసిఎఫ్, జూలై 28: ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో పోలీసులు మరో ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఈ నెల 5వ తేది హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ చేపట్టిన పోలీసులు ఇప్పటివరకు 18 మందిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ముఖిలన్, అప్పు, విజయ్ అనే ముగ్గుర్ని ప్రత్యేక దళం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. హత్యకు సంబంధించి నాటుబాంబులు సరఫరా చేసినందుకు ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో, ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 21కి పెరిగింది.

రూ.40వేల సారా ప్యాకెట్ల స్వాధీనం

ప్యారీస్, జూలై 28 : పుదుచ్చేరి రాష్ట్రంలోని సారా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర పోలీసులు రూ.40వేల విలువైన సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కళ్లకుర్చి కరుణాపురంలో ఇటీవల కల్తీసారా తాగి 67 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనకు సంబంధించి జరుగుతున్న విచారణలో భాగంగా సారా ప్యాకెట్లు కొనుగోలు చేసిన పుదుచ్చేరి దుకాణాల్లో శనివారం సాయంత్రం పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్రిభువనై సమీపంలోని ఆండియార్‌పాళయంలో ఉన్న సారా దుకాణం నుండి రాష్ట్ర సారా వ్యాపారులు సారా ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్నట్లు అందిన సమాచారంతో ఈ తనిఖీలు జరిపారు.

పుళల్ జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, జూలై 28: స్థానిక పుళల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న బాబూలాల్ (35) అనే ఖైదీ బ్లేడు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఎన్నూర్ ప్రాంతానికి చెందిన అతడిని రైల్వే వస్తువుల చోరీ కేసులో సెంట్రల్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయిన బాబూలాల్ శనివారం బ్లేడు ముక్కలుగా చేసి మింగి స్పృహ కోల్పోవడంతో జైలు అధికారులు వెంటనే ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. పుళల్ సీఐ రజనీకాంత్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పెరోల్‌పై విడుదలై అదృశ్యమైన ఖైదీ అరెస్ట్

ప్యారీస్, జూలై 28: పెరోల్‌పై విడుదలై కనుమరుగైన ఖైదీని 12 ఏళ్ల అనంతరం గ్రేటర్ చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతానికి చెందిన కన్నన్ (56) అనే రౌడీ ఓ హత్యకేసులో అరెస్టయ్యాడు. ఆయనకు న్యాయస్థానం యావజ్జీవశిక్ష విధించడంతో అతడిని పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, 2012 జనవరిలో అతడిని న్యాయస్థానం పెరోల్‌పై ఐదు రోజులు విడుదల చేసింది. జైలు నుంచి ఇంటికొచ్చిన ఆయన అజ్ఞాతంలోకి వెళ్లగా పోలీసులు ఆయన కోసం పలు ప్రాంతాల్లో గాలించి చివరకు నాగపట్టణం జిల్లా వేలాంకన్నిలో ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో శనివారం రాత్రి అక్కడకు చేరుకున్న పోలీసులు అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త హత్య

ప్యారీస్, జూలై 28: కన్నియాకుమారి జిల్లా తిరువట్టారు సమీపంలోని కున్నత్తువిళై కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త జాక్సన్ (38)ను హత్యచేసి పరారైన రౌడీ ముఠా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కౌన్సిలర్ ఉషా మేరి భర్త జాక్సన్ నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ టెంపో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శనివారం రాత్రి తిరువట్టారు ప్రాంతంలో ఉన్న రోమన్ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమయంలో అక్కడికి బైకుల్లో వెళ్లిన ఆరుగురు వ్యక్తులు హఠాత్తుగా మారణాయుధాలతో దాడిచేయడంతో జాక్సన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, హంతక ముఠా కోసం గాలిస్తున్నారు.

కడలూరులో అన్నాడీఎంకే నేత హత్య

ప్యారీస్, జూలై 28: కడలూరులో ఆదివారం ఉదయం అన్నాడీఎంకే వార్డు కార్యదర్శి పద్మనాభన్ (43)ను గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చి పరారయ్యారు. కడలూరు నవనీతం నగర్‌కు చెందిన పద్మనాభన్ శనివారం రాత్రి పుదుచ్చేరిలోని తిరుపలంబాక్కం ఆలయ ఉత్సవాల్లో పాల్గొని ఆదివారం తెల్లవారుజామున ఇంటికి బయల్దేరారు. ఆయనను దారిలో అడ్డగించిన గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడిచేసి హత్య చేశారు. దీనిపై పోలీసుల పాథమిక విచారణలో పాతకక్షల కారణంగా ఈ హత్య జరిగి ఉంటుందని పరారైన హంతకుల కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

మమ్మల్ని విస్మరిస్తే కెరీర్‌లో ఎదగలేరు

● నిర్మాత తిరుమలై

నిర్మాతలను విస్మరించే ఏ ఒక్క నటుడు కెరీర్‌లో పైకి ఎదగలేరని నిర్మాత తిరుమలై అన్నారు. అశోక్ సెల్వన్, అవంతిక మిశ్రా జంటగా టి క్రియేషన్స్ బ్యానరుపై నిర్మాత తిరుమలై నిర్మించిన చిత్రం 'ఎమక్కు తొళిల్ రొమాన్స్'. బాలాజీ కేశవన్ దర్శకుడు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ శనివారం విడుదల చేశారు. ఇందులో నిర్మాతల సంఘానికి చెందిన ముఖ్య నేతలతో పాటు ఫెప్సీ అధ్యక్షుడు ఆర్‌కె.సెల్వమణి తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. అయితే, హీరో అశోక్ సెల్వన్, హీరోయిన్ అవంతిక మిశ్రా మాత్రం హాజరుకాలేదు. ఇందులో నిర్మాత తిరుమలై మాట్లాడుతూ, 'ఈ సినిమాను పూర్తి చేసేందుకు మూడేళ్ళపాటు ఒక నటుడిని, నటిని గాలించి గాలించి అలసిపోయాను. ఆ బాధ వర్ణనాతీతం. ఈ చిత్ర హీరో అశోక్ సెల్వన్ కూడా ఒక చిత్రాన్ని నిర్మించారు. ఆయనకు ఎంత డబ్బు ఇవ్వాలో



నిర్మాత తిరుమలై

అంత డబ్బు ఇచ్చి నా సినిమా షూటింగ్ కోసం డేట్స్ అడిగాను. అపుడు ఆయనకు రూ.31 లక్షలు ఇచ్చాను. ఇపుడు అతని పారితోషికం రూ.2 లేదా రూ.3 కోట్లు. నేను ఇచ్చిన రూ.31 లక్షలకు వడ్డీ వేసినా కోటి రూపాయలు అవుతుంది. నిర్మాతలను పట్టించుకోని ఏ నటుడు కూడా ఉన్నతస్థితికి చేరుకున్న దాఖలా లేదు. ఈ స్టోరీ నచ్చడం వల్లే కదా ఆయన నటించేందుకు సమ్మతించారు. రెండున్నర గంటల సమయం కేటాయించాలని రెండున్నర నెలలుగా ప్రాధేయపడుతున్నా. ఇదిగో చెబుతాను.. అదిగో చెబుతాను అంటూ కాలయాపన చేశారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమలకు హీరో వచ్చి ప్రమోట్ చేయాలి. ఒక సినిమా హిట్ అయితే అధికంగా సంపాదించుకునేది నటీనటులే కదా. ఒక దర్శకుడికి కొండంత బలం ఆ చిత్రంలో నటించే నటీనటులే. అలాంటి దర్శక నిర్మాతల మనసులను గాయపరిచే నటీనటులు ఎన్నటికీ బాగుండరు' అని ఆయన తన మనసులోని ఆవేదనను వ్యక్తం చేశారు. కాగా, ఈ చిత్రంలోని ఇతర పాత్రలను సీనియర్ నటి ఊర్వశి, ఎంఎస్ భాస్కర్, విజయ్ వరదరాజ్ తదితరులు పోసించారు. నివాస్ కె.ప్రసన్న సంగీతం. ఈ సినిమా ఆగస్టు నెలలో విడుదల చేయనున్నారు.

'డెడ్‌పూల్ వోల్వెరిన్'కు ప్రేక్షకుల బ్రహ్మరథం

మార్వెల్ స్టూడియోస్ సంస్థ నిర్మించిన కొత్త చిత్రం 'డెడ్‌పూల్ వోల్వెరిన్'. ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం తమిళం, తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో విడుదలైంది. విడుదలైన తొలి రోజే వరల్డ్‌వైడ్‌గా 100 మిలియన్ డాలర్ల మేర కలెక్షన్లు రాబట్టింది. తొలి ఆట నుంచే ప్రేక్షకుల పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. యాక్షన్, కామెడీ సన్నివేశాలు సూపర్బ్‌గా ఉన్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. హాలీవుడ్ నటుడు రియాన్ రెనాల్డ్ డెడ్‌పూల్ పాత్రను పోషించగా, హూక్ జాక్‌మేన్ వోల్వరిన్‌గా అబ్బురపరిచే నటనతో ప్రేక్షకులను ఆలరిస్తున్నారు. భారత్‌లో విడుదలైన అన్ని భాషల్లో కలిపి దాదాపు ఇరవై కోట్ల రూపాయలకు పైగా వసూళ్ళను రాబట్టినట్టు సమాచారం. ప్రపంచ స్థాయిలో కూడా రికార్డు స్థాయిలో కలెక్షన్లు రాబట్టింది. ఫలితంగా విడుదలైన తొలి రోజే మార్వెల్ నిర్మాణ సంస్థ గతంలో నిర్మించిన 'అవెజంర్స్: ఎండ్‌గేమ్', 'స్పైడర్‌మేన్: నో వే హోం' 'డాక్టర్ స్ట్రేంజ్ ఇన్ ది మల్టీవర్స్ ఆఫ్ మ్యాడ్నస్' చిత్రాల జాబితాలో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన సినిమాగా నిలిచింది. ముఖ్యంగా తమిళంలో అనువాద పనులు అద్భుతంగా చేసినట్టు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలో వచ్చే ప్రతి హాస్యపు సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి.



'డెడ్‌పూల్ వోల్వెరిన్'లో ఓ దృశ్యం

చర్మవ్యాధులు సోకాయి

● మాళవిక మోహనన్

చిత్రజ్యోతి

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' చిత్రంలో నటించడం వల్ల చర్మవ్యాధులబారిన పడినట్టు మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తెలిపారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.. దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్లో పనిచేసే తమిళ కూలీల ఇతివృత్తంతో పీరియాడికల్ మూవీగా దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలను ఆమె తాజాగా వివరించారు. 'ఈ మూవీలో వైవిధ్యభరితమైన పాత్రలో నటించాను. వేషధారణ కూడా అలాగే ఉంటుంది. ప్రతి రోజూ మేకప్ వేసుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టేది. ఎర్రటి ఎండల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే నేత్ర సమస్యలతో పాటు చర్మవ్యాధులతో ఇబ్బందిపడ్డాను. దీనికి కారణం.. మండిపోయే ఎండలు. పాత్రకోసం వాడిన దుస్తులు. వేసిన మేకప్. దాదాపు ఐదారుమంది స్కిన్ స్పెషలిస్టుల(వైద్యులు)ను సంప్రదించాల్సి వచ్చింది' అంటూ ఆమె ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు.



అత్యంత వైభవంగా బోనాల జాతర

● ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగిన షావుకారుపేట



ఎల్లమ్మ బోనాలతో తెలంగాణా ఆడపడుచులు



చెన్నై తెలంగాణా సంఘ నిర్వాహకులు, ఒగ్గు కళాకారులతో దేవరకొండ రాజు



శివశక్తి ఉగ్రరూపం



తలపై బోనాలు పెట్టుకొని సందడి చేస్తున్న భక్తులు

ప్యారీస్, జూలై 28: చెన్నై తెలంగాణా సంఘం ఆధ్వర్యంలో రెండో వార్షిక బోనాల జాతరను ఆదివారం వైభవోపేతంగా జరుపుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణా కుటుంబాలకు చెందిన ఆడపడుచులు సంప్రదాయ వస్త్రధారణతో బోనాలతో పెద్దసంఖ్యలో ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్నారు. షావుకారుపేట మింట్ స్ట్రీట్‌లోని రేణుకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం 8.11 గంటలకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ముఖ్యఅతిథిగా హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొన్నారు. అనంతరం వందలాది మంది పాల్గొన్న బోనాల ఊరేగింపును మంత్రి ప్రారంభించారు. యాదాద్రి జిల్లాకు చెందిన తుప్పతి విజయ్‌కుమార్ ఒగ్గు కళాకారుల బృందం డప్పు మోగించి జానపద నృత్యాలతో సందడి చేశారు.



ఒగ్గు కళాకారుల బృంద నాయకుడు విజయ్‌కుమార్ విన్యాసం

శివశక్తులు, పోతరాజుల విన్యాసాలతో షావుకారుపేట నుంచి కొండితోపు వీధులన్నీ కళకళలాడాయి. ఆషాడ మాస బోనాల ఊరేగింపు కొండితోపు పార్క్ సమీపంలోని ఆదిశక్తి అమ్మవారి ఆలయం వద్ద ముగిసింది. ఆత్మీయ అతిథిగా తమిళనాడు తెలుగు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు పాల్గొని, చెన్నై తెలంగాణా సంఘం కార్యవర్గ కమిటీ నిర్వాహకులు, సభ్యులను సంప్రదాయంగా సత్కరించారు.ఈ వేడుకల్లో సంఘం నిర్వాహకుల కుటుంబాలు, డీఎంకే ప్రముఖులు ఎస్.మురళి,అపరంజి, అన్నాదురై తదితరులు పాల్గొన్నారు. అమ్మవారికి కుంకుమ, వేప, పసుపు కొమ్ములు నైవేద్యంతో పాటు బోనాలు కానుకగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కన్నియాకుమారికి పోటెత్తిన పర్యాటకులు

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి ఆదివారం ఉదయం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. సూర్యోదయం తిలకించేందుకు సముద్రతీరం పొడవునా గుమికూడారు. చిరుజల్లులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించి పర్యాటకులు సందడి చేశారు. వారాంతపు సెలవుదినాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం నుండే కన్నియాకుమారికి పర్యాటకుల తాకిడి అధికమైంది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు కేరళ రాష్ట్రం నుండి కూడా పర్యాటకులు రావడంతో కన్నియాకుమారిలోని సందర్శన ప్రాంతాలన్నీ జనంతో నిండిపోయాయి. వేకువజామునే త్రివేణి సంగమం ప్రాంతం వద్ద సూర్యోదయ దృశ్యాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో పర్యాటకులు రాగా, ఆకాశం కాస్త మేఘావృతంగా ఉండటం, దానికి తోడు చిరుజల్లులు కూడా పడటంతో సూర్యోదయం స్పష్టంగా కనిపించక నిరాశ చెందారు. సంగిల్‌తురై, సముద్రతీర ప్రాంతం, భగవతి అమ్మవారి ఆలయం,, తూర్పు సముద్రతీరం, వివేకానంద స్మారక మండప ప్రాంతం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతంలోనూ భక్తుల రద్దీ అధికమైంది. ఇక వివేకానంద స్మారక మండపానికి వెళ్లేందుకు పూంపుహార్ బోట్ సవారీ ప్రాంతం లో కూడా పర్యాటకులు బారులు తీరారు. వాన జల్లులు కురవటంతో బోట్ సవారీ ఉదయం 8.30 గంటలకు బదులుగా అరగంట ఆలస్యంగా తొమ్మిది గంటలకు ప్రారంభమైంది. ఇదే విధంగా భగవతి అమ్మన్ ఆలయం, తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, కొట్టారం రామాలయం, సుశీంద్రం తానుమాలయసామి ఆలయం, వివేకానంద కేంద్రం ప్రాంగణంలోని భారతమాత ఆలయం తదితర ప్రాంతాల్లోనూ పర్యాటకులు గుమికూడారు. శనివారం రాత్రి నుండే పర్యాటకుల రాక అధికం కావటంతో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



కన్నియాకుమారి సముద్రతీరం వద్ద గుమికూడిన పర్యాటకులు

ఎన్నికల్లో పోటీకి మాకూ అవకాశం ఇవ్వండి

● యూత్ కాంగ్రెస్ నేత లెనిన్ ప్రసాద్



యూత్ కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశంలో లెనిన్ ప్రసాద్, సెల్వపెరుందగై తదితరులు

ప్యారీస్, జూలై 28: పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడింట ఒక వంతు సీట్లను యూత్ కాంగ్రెస్‌కు కేటాయించాలంటూ ఆ విభాగం అధ్యక్షుడు లెనిన్ ప్రసాద్ కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం లెనిన్ ప్రసాద్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, ఉపాధ్యక్షుడు స్వర్ణా సీతారామన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామన్, శ్రీని, సూర్యప్రకాష్, జోశ్వా జెరాల్డ్, సింధుజ పాల్గొన్నారు. ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాల గురించి లెనిన్ ప్రసాద్ మీడియాకు వివరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమిళనాడు పేరు లేకపోవడం ఖండించదగ్గదన్నారు. యువజన కాంగ్రెస్ నిర్వాహకులకు పార్టీలో కీలక పదవులు అప్పగించాలని, రాబోయే ఎన్నికల్లో మూడింటిలో ఒక వంతు సీట్లు యూత్ కాంగ్రెస్‌కు కేటాయించాలని ఏఐసీసీకి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సినీ నటుడు ప్రశాంత్

వాకథాన్ ప్రారంభించిన నటుడు ప్రశాంత్

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్లెనేగెల్స్ హెల్త్ సిటీ చెన్నై ఆధ్వర్యంలో 'వరల్డ్ హెపటైటిస్ డే' సందర్భంగా 'ఆరోగ్యకరమైన కాలేయం' పేరుతో నిర్వహించిన అవగాహన వాకథాన్‌ను సినీ నటుడు ప్రశాంత్ ప్రారంభించారు. ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ వాకథాన్‌లో సుమారు 1,000 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్లెనేగెల్స్ హెల్త్ సిటీ చెన్నై సీఈవో డా.నాగేశ్వరరావు, హెల్త్ సిటీ హెపథాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజీ డైరెక్టర్ డా.జాయ్ వర్గీస్, హెల్త్ సిటీ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, హెచ్‌పీబీ సర్జరీ డైరెక్టర్ డా.మెట్టు శ్రీనివాస రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లివర్ అనస్తీషియా, క్రిటికల్ కేర్ హెచ్‌ఓడీ డా.సెల్వకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... హెపటైటిస్ బీ, సి లపై జాగ్రత్త అవసరమని, సకాలంలో వైద్యం చేయించుకోని పక్షంలో కాలేయ సంబంధిత సమస్యలు, క్యాన్సర్ తదితర సమస్యలకు గురయ్యే ప్రమాదముందన్నారు. హెపటైటిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ వాక్‌థాన్ నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. వాకథాన్‌లో పాల్గొన్న వారికి తొలుత నిపుణులచే వామ్-అప్ సెషన్ జరిగింది. వాకథాన్‌లో హైపటైటిస్-బిపై అవగాహన కల్పించేలా ప్ల కార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు.

కమల్‌తో పుదువై కాంగ్రెస్ నేతల భేటీ



మక్కల్ నీదిమయ్యం నేత కమల్‌హాసన్‌తో పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపీ వైద్యనాథన్, మాజీ సీఎం నారాయణస్వామి తదితరులు

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆదివారం ఉదయం మక్కల్ నీదిమయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్‌తో భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం పుదుచ్చేరి రాష్ట్రంలో ప్రచారం చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఆళ్వార్‌పేటలోని మక్కల్ నీదిమయ్యం కార్యాలయంలో కమల్‌హాసన్‌ను పుదుచ్చేరి కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు వైద్యలింగం, ఆ రాష్ట్ర మాజీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి కందసామి తదితర కాంగ్రెస్ నేతలు కలిసి చర్చించారు. మక్కల్ నీదిమయ్యం పార్టీ ఉపాధ్యక్షుడు ఏజీ మౌర్యా, ఆర్.తంగవేలు, ప్రధాన కార్యదర్శి ఎ.అరుణాచలం, పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి జీఆర్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పుదుచ్చేరిలో కాంగ్రెస్, మక్కల్ నీదిమయ్యం పార్టీ పరిస్థితులు గురించి రెండు పార్టీల నాయకులు చర్చించారు. 2026లో తమిళనాట జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కొత్త పార్టీలను కూటమిలో చేర్చుకునే విషయం గురించి కూడా సమగ్రంగా చర్చలు జరిపారు.

చంద్రుడిపై అంతరిక్ష పరిశోధన కేంద్రం

● ఇస్రో మాజీ ఛైర్మన్ మయిల్‌సామి అన్నాదురై



పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మయిల్‌సామి అన్నాదురై

చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) చంద్రుడిపై పరిశోధన చేయడంలో అగ్రస్థానంలో ఉందని, ఈ పరిశోధన చందమామపై అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు దోహదపడుతుందని ఇస్రో మాజీ ఛైర్మన్ మయిల్‌సామి అన్నాదురై తెలిపారు. ఆదివారం ఉదయం కోయంబత్తూరు కినత్తుకడవు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ తాను ఈ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి సైంటిస్టుగా ఎదిగానని చెప్పారు. ఇస్రో చంద్రుడిపై పరిశోధన చేసి అక్కడ నీరుందని నిరూపించిందని, చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఎలా మెల్లగా దిగగలుగుతామో లోకానికి చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఈ పరిశోధనల పర్యవసానంగా ప్రపంచ దేశాలన్నీ కలిసి చంద్రుడిపై అంతరిక్ష పరిశోధన కేంద్రం ఏర్పాట్లు సన్నాహాలు చేపడుతున్నాయని చెప్పడం అతిశయోక్తికాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్‌మహేష్ కూడా పాల్గొన్నారు.

కిలాంబాక్కం మెట్రోరైలు పథకానికి అనుమతివ్వని రాష్ట్ర ప్రభుత్వం



చెన్నై, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ దాకా మెట్రోరైలు విస్తరణ పథకానికి రాష్ట్ర ఆర్థిక శాఖ ఇంకా అనుమతివ్వలేదని ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. చిట్లపాక్కంకు చెందిన దయానంద్ కృష్ణన్ సమాచార హక్కు చట్టం ప్రకారం ఈ విస్తరణ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాఖాపరమైన అనుమతులిచ్చాయా అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం బదులిస్తూ ఆర్థిక శాఖ ఈ మెట్రోరైలు విస్తరణ పథకానికి ఇంకా అనుమతివ్వలేదని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అనుమతి రావాల్సి ఉందని వెల్లడించింది. కిలాంబాక్కం కొత్త బస్‌టెర్మినల్‌లో దిగే ప్రయాణికుల ఇబ్బందులను పూర్తిగా తొలగించేందుకు మెట్రోరైల్వేస్ మీనంబాక్కం నుంచి కిలాంబాక్కం వరకు మెట్రోరైలు పొడిగించనున్నట్లు 22 మాసాలకు ముందు ప్రకటించింది. ఈ విస్తరణ పథకానికి సంబంధించి రూపొందించిన ప్రాజెక్టు వివరాలను, ప్రణాళిక వివరాలను రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు పంపింది. ఈ నేపథ్యంలో ఆర్టీఐ సమాచారం బట్టి రాష్ట్ర ఆర్థిక సంఘం ఈ పథకానికి ఇంకా అనుమతి జారీ చేయలేదని స్పష్టమైంది.

వైఫల్యం నుంచి విజయాల పాఠం నేర్చుకోవాలి

● వీఐటీ 'స్టార్స్' వేడుకల్లో ఇస్రో చంద్రయాన్-3 ప్రోగ్రామ్ డైరెక్టర్ వీరముత్తువేల్

వేలూరు, జూలై 28: వైఫల్యం నుంచి విజయాలకు చేరుకునే పాఠాలు నేర్చుకోవాలని ఇస్రో చంద్రయాన్-3 ప్రోగ్రామ్ డైరెక్టర్ వీరముత్తువేల్ విద్యార్థులకు సలహా ఇచ్చారు. వీఐటీ సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'స్టార్స్' పేరుతో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత విద్యా కోర్సుల్లో చేర్చుకోవడం, వారికి వసతి కల్పిస్తున్నారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ పథకంలో సీటు పొందిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందించే కార్యక్రమం వర్సిటీ ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్లు శంకర్, సెల్వం, ట్రస్ట్ నిర్వాహకులు సుజిత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇస్రో చంద్రయాన్-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరముత్తువేల్ పాల్గొని విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు, ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... విద్యారంగం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లినా, ఆ రంగానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు పెంచకపోగా, విద్యాసంస్థల నుంచి జీఎస్టీ పేరుతో పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త వీరముత్తువేల్ మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదవాలని, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకొని విజయం దిశగా పయనించాలన్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌లో కూడా పలు దశల్లో చేపట్టిన పరిశోధనలు వైఫల్యం చెందాయన్నారు. ఈ వైఫల్యాలు సరిచేసుకొని చంద్రుడి దక్షిణ ధృవంపై చంద్రయాన్-3ను విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచంలోనే భారత్ పేరును సువర్ణాక్షరాలతో లిఖించామని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న వీఐటీ వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్, ఇస్రో శాస్త్రవేత్త వీరముత్తువేల్

కుట్రాలం వద్ద పర్యాటకుల సందడి

పెరంబూర్, జూలై 28: నీటి ప్రవాహం తగ్గడంతో ఆదివారం కుట్రాలంలోని జలపాతాల వద్ద పర్యాటకులను అనుమతించారు. పశ్చిమ కనుమల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలంలోని ప్రధాన జలపాతం, అందరువి, సినీ ఫాల్స్ తదితర జలపాతాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతాల వద్దకు వెళ్లడం, స్నానాలు చేయడంపై అటవీ శాఖ నిషేధం విధించింది. అలాగే, జలపాతాల వద్ద పోలీసు, అటవీ సిబ్బంది భద్రతా విధులు చేపట్టారు. ఈ నేపథ్యంలో, ఆదివారం జలపాతాల వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో పర్యాటకులను అనుమతించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకులు జలపాతాల వద్ద స్నానాలు చేస్తూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.



జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు